22 ఏళ్లకే డాక్టరేట్.. నైనా జైశ్వాల్ రికార్డు



ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న నైనా జైశ్వాల్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 22 ఏళ్ల వయస్సులో డాక్టరేట్ అందుకున్న తొలి భారతీయురాలిగా కాచిగూడకు చెందిన, టేబుల్ టెన్నిస్ అంతర్జాతీయ క్రీడాకారిణి నైనా జైశ్వాల్ రికార్డు నెలకొల్పారు. మైక్రో ఫైనాన్స్ ఇన్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై పరిశోధనలు చేసినందుకు గాను నైనా జైశ్వాల్ ఆంధ్రప్రదేశ్ రాజమండ్రిలో గల ఆది నన్నయ్య యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ మేరకు బుధవారం యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా నైనా జైశ్వాల్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. చిన్న వయస్సులో పీహెచ్‌డీ పూర్తి చేయడం, గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకోవడం సంతోషంగా ఉందని నైనా జైశ్వాల్ అన్నారు.



పద్మశ్రీ ఉమామహేశ్వరి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

పద్మశ్రీ ఉమామహేశ్వరికి ఘన సత్కారం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సంస్కృతంలో హరికథ చెప్పగలిగే ఒకే ఒక్క భాగవతారిణి దాలిపర్తి ఉమా మహేశ్వరిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారం ప్రకటించడం అభినందనీయమని తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం ప్రణవ్ కూచిపూడి నృత్య శిక్షణాలయం ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు ప్రకటిత భాగవతారిణి డి.ఉమామహేశ్వరికి అభినందన సత్కారం చేశారు. పలువురు నృత్య కళాకారులు పాల్గొని ఆమెను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా బుర్రా వెంకటేశం పాల్గొని మాట్లాడారు. హరికథకు తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరముందని అన్నారు. కార్యక్రమంలో డా.పద్మజారెడ్డి, కళాకృష్ణ, డా.పసుమర్తి రామలింగశాస్త్రి, డా.కోట్ల హనుమంతరావు, డా.భాగవతుల సేతూరామ్, డా.వనజా ఉదయ్, రమాదేవి, అంజుబాబు, డా.మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారగ్రహీతల్ని సత్కరిస్తున్న అతిథులు

'అక్కినేని' పురస్కారాల ప్రదానోత్సవం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సినీ జీవితంలోనే కాకుండా నిజ జీవితంలో కూడా ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి అక్కినేని నాగేశ్వరరావు అని ఏపీ పాఠశాల నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువ కళావాహిని ఆధ్వర్యంలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అభినయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.వి.నారాయణరావు, ఆర్.ప్రసన్నరాణి, జెన్నిలకు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ రామలింగేశ్వరరావు పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సారిపల్లి కొండలరావు, కె.వి.కృష్ణకుమారి, రామసత్యనారాయణ, ఎస్.వి.రామారావు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం నిర్వహించండి..!

- హైకోర్టులో బీజేపీ కార్పొరేటర్ పిటిషన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. పాలకమండలి ఎన్నికై మూడేళ్లు కావస్తోందని.. ఇప్పటి వరకు 30 గంటలు కూడా ప్రజాసమస్యలపై చర్చ జరగలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏడు సమావేశాలు మాత్రమే జరిగాయని, ఎజెండా, సభ్యుల ప్రశ్నలపై పూర్తిస్థాయి చర్చ జరిగిన దాఖలాలు లేవన్నారు. ప్రజాస్వామ్య దేశంలో చట్టసభలు కోర్టు ఆదేశాల ద్వారా నడపాల్సి రావడం దౌర్భాగ్యమని ఆయన పేర్కొన్నారు.

పైసలివ్వక ఆగిన పనులు..

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. అయితే, ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు పూర్తి కాకపోవడానికి నిర్దిష్ట కారణాలను రైల్వే అధికారులు నూతన ప్రభుత్వం దృష్టికి ఇంకా తీసుకుపోలేదని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా అందితే పనులు యుద్ధప్రాతిపదికన పూర్తవుతాయని రైల్వే అధికారులు అనధికారికంగా స్పష్టం చేస్తున్నారు.

యాదాద్రి ప్రతిపాదనలకు బ్రేక్

ఎంఎంటీఎస్ రెండోదశలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడంతో పాటు యాదాద్రి వరకు పొడిగింపు విషయమై ఓకే చెప్పకపోవడంతో పనులకు బ్రేక్ పడినట్టు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలకు రైల్వే శాఖ ఆమోదం తెలుపుతూ ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ రెండో దశను పొడిగించడానికి అంగీకరించింది. మొదట్లో రూ.350 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. ఆ తర్వాత అంచనా వ్యయం పెరిగింది. ప్రాజెక్టులో భాగంగా ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు కొత్తగా నిర్మించవలసిన స్టేషన్లు, ఇప్పటికే ఉన్న స్టేషన్లను అభివృద్ధి చేయడం, ట్రాక్ నిర్మాణం తదితర పనుల కోసం రైల్వే శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే, ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి లిఖిత పూర్వక అంగీకారం రాలేదని తెలిసింది. దాంతో ప్రస్తుతానికి ఈ ప్రతిపాదలకు బ్రేక్ పడినట్టు సాక్షాత్తూ రైల్వే జీఎం వెల్లడించారు.

సివరేజీ నిర్వహణ బంద్

(5వ పేజీ తరువాయి)

నేపథ్యంలో మరో రెండు నెలల పాటు కొనసాగించారు. నవంబర్, డిసెంబర్, జనవరి నెలకు వాహనాల బిల్లులను పెండింగ్ పెడుతూ అధికారులు వచ్చారు. సంస్థలో ఆర్థిక పరిస్థితులు దృష్ట్యా వాయిదా వేస్తూ వచ్చారు.

కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారమే చెల్లించాలి..

దళితబంధు పథకంలో భాగంగా మూడు నెలల క్రితం 160 వరకు సిల్ట్ కార్టింగ్ (పూడికతీత వ్యర్థాల రవాణా) వాహనాలను ప్రవేశ పెట్టారు. దీంతో ఒక్కో జెట్టింగ్, మినీ ఎయిర్ టెక్ వాహనానికి రూ.40వేలు తగ్గిస్తామని, పూడికతీత వ్యర్థాల రవాణా చేయొద్దని వాటర్ బోర్డు అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో జరిగిన చర్చల్లో 2010లో జరిగిన ఒప్పంద ప్రకారమే బిల్లులు ఇస్తామని జలమండలి, కొత్త ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం బిల్లులు చెల్లించాలని సీవర్ క్లీనింగ్ మెషిన్స్ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే వారు వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. బిల్లులు చెల్లించే వరకూ పూడికతీత పనులు చేపట్టబోమని, బిల్లుల్లో కోతలు పెడితే కుదరదని సీవర్ క్లీనింగ్ మెషిన్స్ ఓనర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది. మొత్తంగా కొన్నిచోట్ల పూడికతీత పనులపై వీరి ప్రభావం పడుతోంది. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు విధుల్లోకి చేరబోమని అసోసియేషన్ నేతలు స్పష్టంగా చెబుతుండగా.. అధికారుల నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఒక్కరోజు సివరేజీ నిర్వహణ సక్రమంగా లేకుంటే రోడ్లు అధ్వానంగా మారతాయి. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు తమ వాహనాలు విధుల్లో చేరవని అసోసియేషన్ నేతలు గౌస్, శ్రీధర్, విజయ్ కుమార్, చింతల రాజలింగం, కల్పన, వేణుగోపాల్, నరేష్ ప్రకటించారు.

సంజయ్‌గాంధీనగర్‌లో

రూ. 16 లక్షలతో డ్రైనేజీ పైపులైన్



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

నల్లకుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో రూ. 16 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గురువారం ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ అమృత, అధికారులతో కలిసి కాలనీలో పాదయాత్ర చేసి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. జలమండలి మేనేజర్ షకీర్, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీఆర్ఎస్ నాయకులు కూర నరేందర్, మూర్తి, యశ్వంత్ పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు

ముషీరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ సందాని వీధిలో రూ. 5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్ తాహా గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముషీరాబాద్ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, ఆర్. శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ముగ్ధాల్, జబ్బార్, యువజన కమిటీ అధ్యక్షుడు సాయి తదితరులు పాల్గొన్నారు.



భోలక్‌పూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్ తాహా

వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ బస్తీ వాసులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు పి. శంకర్ ఆధ్వర్యంలో బాధితులు, సంస్థ సభ్యులు గురువారం బస్తీలో, హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే ఎం. కోదండరెడ్డితో కలిసి అదనపు కలెక్టర్ మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు, డీబీఎఫ్ సభ్యులు

బస్తీవాసులకు దుప్పట్ల పంపిణీ

వివేకానందనగర్ బస్తీ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి హామీ ఇచ్చారు. స్టే ఉన్నా.. ఇళ్లను కూల్చివేయడానికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులను గురువారం పరామర్శించి దుప్పట్లు పంపిణీ చేశారు. పక్కా ఇళ్ల మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. పీసీసీ కార్యదర్శి జీఎన్ కేశవ్, రాజ్‌కిశోర్, బల్వంతరావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహలతాదేవి హంతకుల కోసం

ఆరు ప్రత్యేక బృందాల గాలింపు

కవాడిగూడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సంచలనమైన స్నేహలతాదేవి(61) హత్య కేసును ఛేదించడానికి ఆరు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం గగన్‌మహల్ రాధామదన్ నివాస్‌లో వృద్ధురాలి హత్య విషయం తెలిసిందే. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీకెమరాలతోపాటు, దారిలో ఉన్న సీసీకెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. వృద్ధురాలి హత్య, దొంగతనం చేసిన వారిలో ఇద్దరు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మహేష్‌కు సహకరించింది ఎవరు అనే దానిపై ఆరా తీస్తున్నారు. పోలీసులను తప్పుదోవ పట్టించడానికి నిందితుడు మహేష్ పథకం ప్రకారం వ్యవహరించినట్లు తెలిసింది.

పోలీసుల దృష్టిమరల్చి నిందితుల పరారీ?

వృద్ధురాలిని చంపి నగలు, నగదుతో ఉడాయించిన బిహార్ రాష్ట్రానికి చెందిన మహేష్, అతడి స్నేహితుడు పోలీసులను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నం చేసినట్లు తెలిసింది. సంఘటన జరిగిన తరువాత ఇద్దరూ ఆటో మాట్లాడుకున్నారు. ఆటోలో కూర్చొని కొద్దిసేపటికి దిగిపోయారు. ఆటో దిగిపోయే సమయంలో మహేష్ తన సెల్‌ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టి ఆటో వెనకభాగంలో వేశాడు. పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పట్టుకోవడానికి ప్రయత్నించగా.. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో గురువారం ఉదయం ఆటోలో మహేష్ ఫోన్ లభించినట్లు తెలిసింది. అందులోని డాటాను పరిశీలించి నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. మహేష్ భార్య బిహార్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. మహేష్ స్నేహలతాదేవి శరీరంపై ఉన్న నగలతోపాటు బీరువాలో ఉన్న 20 తులాల బంగారు నగలు, రూ. 3 లక్షలు, వజ్రాలు అపహరించినట్లు తెలిసింది.

నిందితులు బిహార్ వెళ్లారా? లేక నగరంలో ఉన్న స్నేహితులు, బంధువుల ఇళ్లలో ఉన్నారా? అనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో నిందితులను గుర్తించే ప్రయత్నంలో పోలీసులు ఉన్నట్లు తెలిసింది.



హరికథా మహోత్సవాల ప్రారంభోత్సవంలో గుత్తా సుఖేందర్‌రెడ్డి, డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

కళలను పరిరక్షించుకోవాలి

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

రాంనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కళలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి 72వ పుట్టినరోజు సందర్భంగా కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట శృంగేరి శంకరమఠంలో హరికథా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కళాకారులను ప్రోత్సహిస్తూ, కళారంగాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. హరికథా కార్యక్రమం వీనులవిందుగా సాగింది.



లతాశ్రీని సన్మానిస్తున్న కాశీవిశ్వేశ్వరరావు, కళాజనార్దనమూర్తి

సంగీతబద్ధంగా త్యాగరాజస్వామి కీర్తనలు


చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అన్నమాచార్య కీర్తనల్లో సాహిత్యం పాలు ఎక్కువ కాగా, త్యాగరాజస్వామి కీర్తనలు సంగీతబద్ధంగా ఉంటాయని మాజీ న్యాయమూర్తి కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయగానసభలో జరుగుతున్న త్యాగరాజస్వామి ఆరాధన వేడుకల ముగింపు కార్యక్రమంలో ఆయనతోపాటు పర్యాటకశాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించారు. సంగీత గురువు లతాశ్రీని సన్మానించారు. అనంతరం రమాప్రభ శిష్య బృందం త్యాగరాజస్వామి కీర్తనలు గానం చేశారు.

ఘనంగా సుందరకాండ కార్యసిద్ధి హోమం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో సుందరకాండ కార్యసిద్ధి హోమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కల్యాణ మండపం ఆవరణలో కొలువైన సీతారామాంజనేయ స్వామి విగ్రహాలను, ఉత్సవ మూర్తులను రకరకాల పూలతో అలంకరించి పూజలు చేశారు.

ఏపీ తెలుగు భాషారత్న పురస్కారానికి

దేవదాసు ఎంపిక



చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్ట్ బైస దేవదాసును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారభాషా సంఘం తెలుగు భాషారత్న జీవనసాఫల్య పురస్కారానికి ఎంపికచేశారు. ఈ మేరకు సంఘం చైర్మన్ పి. విజయబాబు ప్రకటన విడుదల చేశారు. ఈనెల 5న నాగార్జునసాగర్ వద్దనున్న నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే వేడుకల్లో పురస్కారాన్ని దేవదాసుకు బహూకరిస్తామని తెలిపారు.

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

రాంనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పై రాజకీయ పార్టీల నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. వారి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

ఎన్నికల బడ్జెట్



పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పార్లమెంట్ ఎన్నికల బడ్జెట్‌గా ఉంది తప్ప ప్రజలకు మేలు చేసే విధంగా ఎలాంటి కేటాయింపులు లేవు. ప్రజల నమ్మకాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి వమ్ము చేసింది.

- కె.మాధవ్, బీఆర్ఎస్ నగర నాయకుడు

దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోరేది..



బడ్జెట్ దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువతకు ఉపాధి కల్పించే విధంగా బడ్జెట్ ఉంది. దేశ ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపరచడంతోపాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించే విధంగా బడ్జెట్ కేటాయింపు జరిగింది. సోలార్ విద్యుత్ సేవలను కోటి మందికి ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించడం హర్షణీయం

-కౌండిన్యప్రసాద్, బీజేపీ నగర కార్యవర్గ సభ్యుడు

కేటాయింపుల్లో సమతుల్యం లేదు



బడ్జెట్ దళితులకు అంకెలలో పెరుగుదల, ఖర్చులలో మరుగుదలగా ఉంది. దళితుల సమగ్రాభివృద్ధికి కేటాయింపు సరిగా లేదు. కేటాయింపులో సమతుల్యం లేదు. పారిశ్రామికవేత్తలకు మేలు చేసే విధంగా ఉంది.

- టి.స్కైలాబ్‌బాబు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పేదలకు లాభం



ప్రధానమంత్రి సూర్యోదయ యోజన పథకం ద్వారా కోటి కుటుంబాల ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ ప్యానల్ ఏర్పాటుకు సబ్సిడీ ద్వారా రూ. 11 వేల కోట్లు కేటాయించడం వల్ల పేదవారికి ఆర్థిక లాభం చేకూరుతుంది. 300 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వడం, 7 లక్షల ఆదాయం వరకు ఎన్‌కామ్ ట్యాక్స్ పెంచడం వల్ల ఉద్యోగులకు లాభం చేకూరుతుంది.

-పులిగారి గోవర్ధన్‌రెడ్డి, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్

ఆదర్శ జంట ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ జంట ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియా, వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. 30 నుంచి 45 సంవత్సరాల వయస్సున్న జంటలు ఈనెల 8లోగా దరఖాస్తులను వైఎస్ఆర్ మూర్తికి వాట్సాప్(9849569626) చేయాలని కోరారు. ఎంపికైన మూడు జంటలకు 12న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

ఎంబీసీ కార్పొరేషన్ ద్వారానే బీసీలకు న్యాయం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. ఎంబీసీ కార్పొరేషన్ ద్వారానే అట్టడుగున ఉన్న బీసీ కులాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.



నిరుద్యోగుల ధర్నాలో మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి తదితరులు

ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి

కవాడిగూడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాల భర్తీకి కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే, ధరణి పోర్టల్ సభ్యుడు ఎం. కోదండరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో పీఈటీ, పీడీ పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగ, ప్రైవేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంగా నిరసన దీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోదండరెడ్డి మాట్లాడుతూ.. పీఈటీ అభ్యర్థుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, అసోసియేషన్ అధ్యక్షుడు మాదగోని సైదులు గౌడ్ మాట్లాడుతూ.. పీఈటీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, పీఈటీ అభ్యర్థులు పాల్గొన్నారు.

'వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మె'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఫీవర్ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతారని తెలంగాణ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, ఫీవర్ ఆస్పత్రి యూనిట్ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ హెచ్చరించారు. వేతనాలు చెల్లించాలని సాహితీ కన్సల్‌టెన్సీ, నక్షత్ర కన్సల్‌టెన్సీ యాజమాన్యాలను కోరుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులు గురువారం కూడా విధులను బహిష్కరించి ధర్నా చేశారు. వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. యూనియన్ ఉపాధ్యక్షుడు జనార్దన్, కోశాధికారి శ్రీకాంత్, నాయకులు బాలరాజు, కవిత, సరిత తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ పేరిట నంది అవార్డులు హర్షణీయం

రాంనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నంది పురస్కారాలను వచ్చే ఏడాది నుంచి ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరిట ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని సామాజిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పోకల కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోసంగి శ్రీనివాస్, డాక్టర్ రమేష్‌యాదవ్, టీఎల్ఎఫ్, బీసీ సంక్షేమ సంఘం, దక్షిణాది రాష్ట్రాల నాయకుడు మేరోజు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరబిక్ మతపరమైన భాష కాదు

- ఇఫ్లూ వర్సిటీ ప్రొఫెసర్ సయ్యద్ జహంగీర్

రాంనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అరబిక్ మతపరమైన భాష కాదని, చారిత్రకమైన భాష అని ఇఫ్లూ యూనివర్సిటీ ప్రొఫెసర్ సయ్యద్ జహంగీర్ పేర్కొన్నారు. గురువారం అంబేడ్కర్ కళాశాలలో అరబిక్ భాషా విభాగం ఆధ్వర్యంలో అరబిక్ భాషా దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ఆకాశవాణిలో నా వాణి రేడియో టాక్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అరబిక్ భాషకు మూలం హీబ్రూ అని అన్నారు. ప్రపంచంలో ఆరవ భాషగా గుర్తింపు పొందిందన్నారు. విద్యార్థులు అరబిక్ భాష పట్ల మరింత అధ్యయనం చేయాలన్నారు. అరబిక్ భాష అధ్యక్షుడు ఎం.ఎఫ్.రెహ్మాన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. భవానీ, భాషా శాఖ అధ్యక్షుడు కె. కవిత తదితరులు పాల్గొన్నారు.

'అనుమతిలేని కాస్మెటిక్ క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలి'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అనుమతులులేని కాస్మెటిక్ క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు ఔషధ నియంత్రణ శాఖకు ఫిర్యాదు చేశారు. వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి గురువారం ఔషధ నియంత్రణశాఖ జాయింట్ డైరెక్టర్ గుగులోతు రాందన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న స్లిమ్మింగ్, కాస్మెటిక్ క్లినిక్‌ల అక్రమ వ్యాపారాలవల్ల అమాయకులు మోసపోతునానరని అన్నారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న ప్రముఖులు

పదవీ విరమణ ఉద్యోగానికే..

రాంనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఏఏవోగా పనిచేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన గిడి సత్యనారాయణను గురువారం బాగ్‌లింగంపల్లిలో పలువురు ప్రముఖులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక వేత్త రాయపాటి రవి, విజ్ఞాన్ విద్యానికేతన్ కరస్పాండెంట్ కె.ఐజాక్ అరవిందం మాట్లాడుతూ.. పదవీ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమేనని.. వయస్సుకు కాదన్నారు. ఐఎన్‌టీయూసీ గ్రేటర్ హైదరాబాద్ మాజీ అధ్యక్షుడు ఎం.ఎస్.ప్రకాష్‌రావు, జర్నలిస్టు కందుకూరి నర్సింహ, దుర్గం మోహన్, ఆర్.ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా

లింగాల శ్రీకాంత్ గౌడ్



శ్రీకాంత్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న అనిల్‌కుమార్

ముషీరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా లింగాల శ్రీకాంత్‌గౌడ్ నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం. అనిల్ కుమార్ యాదవ్ ఆయనకు గురువారం నియామకపత్రం అందజేశారు. శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

డీడీ కాలనీలో రాత్రిపూట పెట్రోలింగ్ పెంచాలి

రాంనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలో రాత్రి సమయంలో పెట్రోలింగ్ పెంచాలని, బయటి వాహనాలు కాలనీలో పార్క్ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈస్ట్‌జోన్ డీసీపీ సాయిశ్రీకి డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండా.లక్ష్మీకాంత్‌రెడ్డి, సభ్యులు ఎన్. గౌతమ్‌రావు, పి.గోవర్ధన్‌రెడ్డి గురువారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీసీపీని కలిసిన వారిలో అసోసియేషన్ సభ్యులు ప్రసన్న, డాక్టర్ పుట్ట పాండురంగయ్య, డాక్టర్ జి.హరిచరణ్, రమేష్‌రెడ్డి, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



డీసీపీ సాయిశ్రీకి జ్ఞాపిక అందజేస్తున్న డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు